

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

చిత్తూరు
తిరుపతి




### గుంట పోరంబోకు భూమి కబ్జా...
# రియల్ ఎస్టేట్ వ్యాపారం

**కోట్లు సంపాదన.. పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తొట్టంబేడు రెవెన్యూ సర్వే నెంబర్ 89/1లో 1ఎకర 24సెంట్లు గుంట పోరంబోకు భూమిని వెంకటగిరి నియోజక వర్గం నుండి వలస వచ్చి శ్రీకాళహస్తి పట్టణంలో స్థిర పడిన టూ వీలర్ యజమాని కబ్జా చేసి చదును చేసి ప్లాట్లు వేసి విక్రయించడం జరిగింది. అడిగిన వారికి వైయస్సార్ పార్టీ మాజీ ఎమ్మెల్యేకి సగం. నాకు సగం ప్లాట్లు వేసి విక్రయించి పంచుకున్నామని బహిరంగంగా చెబుతున్నాడు. గత వైయస్సార్ పార్టీలో చోటా రాజకీయ నాయకులు. దళారులు చెరువులు, గుంటలు వదలకుండా రాత్రికి రాత్రి పూడ్చి వేసి చట్టవ్యతి రేకంగా అనధి కారికంగా ప్లాట్లు వేసి విక్రయించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్లు రూపాయలు దండు కున్నారు. ఈ ప్రభుత్వ గుంట పోరం బోకు భూమి ఆ ప్రాంతంలో రేట్ల ప్రకారం సుమారు రూ.3 కోట్లు విలువ ఉన్నది. ప్రస్తుతం ఈ భూమిని గుంట కనబడకుండా పక్కా ప్లాట్లు వేసి విక్రయాలు జరిపారు. గత ప్రభుత్వం ఏలుబడిలో అప్పటి తహసిల్దర్ పరమేశ్వర్ స్వామి అండ దండలతో గత వైసీపీ పాలకులు అనాధీనం,

మిగతా 2లో




### పేరు కోసం అక్కడ...
# రాబడి కోసం ఇక్కడ..!


**తప్పనిసరి పరిస్థితులో వైద్యం కొనుగోల చోద్యం చూస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు**

**ప్రభుత్వ హాస్పిటల్లో లక్షల్లో జీతాలు.. సమయపాలన పాటించని డాక్టర్లు**

**రోగులను పట్టించుకోని ప్రభుత్వ వైద్యులు**

**ప్రైవేటు వైపు చూసేలా సూచనలు సొంత క్లినిక్‌లకు, ల్యాబ్‌లకు తరలింపు**

**తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వైద్యం కొనుగోలు**



**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** వైద్యో నారాయణ హరి అంటూ.. అలనాటి నుంచి డాక్టర్లను దైవంగా భావిస్తారు. మానవీయతకు మారుపేరుగా డాక్టర్లను అభివర్ణిస్తారు. అలాంటి వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని విస్మరిస్తూ మానవీయ కోణాలను చెరిపేస్తూ కాసుల కోసం కక్కుర్తి పడి వైద్య వృత్తిని పక్కా వ్యాపారంగా మార్చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా సగటు పౌరుడు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే ఆలోచిస్తున్నాడు. అక్కడ సరైన వైద్య సేవలు అందుతాయా? నాణ్యమైన మందులు ఉంటాయా? బాధ్యతగా చూస్తారా? అని సందేహిస్తున్నారు. ప్రజలు భయపడుతున్నట్టే కొన్ని ఆస్పత్రుల వైద్యులు వ్యవహరిస్తున్నారు. రోగులను నిర్లక్ష్యంగా చూడడం.. తాము నిర్వహించే క్లినిక్లకు రమ్మని చెప్పడం.. మందులు కూడా బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకోమనడం తదితర ఘటనలు తిరుపతితో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో సర్వసాధారణంగా మారాయి. ప్రభుత్వ వైద్యం అందక పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులేమో ప్రైవేటు రాబడికి

మిగతా 8లో

### భూ సమస్యల పరిష్కారమే
# ప్రత్యేక అజెండాగా ముందుకు సాగుతున్నా

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**రానున్న మూడు నెలల పాటు ప్రతి సోమవారం పలమనేరు డివిజన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ**

**ప్రజలు సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే**

**పలమనేరు, మేజర్‌న్యూస్:** భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా ముందుకు వెళుతున్నామని, పలమనేరు డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి రానున్న మూడు నెలల పాటు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ ఉంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయంలో పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, పలమనేరు శాసన సభ్యులు ఎన్.అమరనాథ్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్‌లు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందుతున్న వినతులలో దాదాపు 95శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. ఇందులో డికెటి, కుటుంబ తగాదాలు, ఆర్ఓఆర్, ఆన్‌లైన్ రికార్డులలో సమస్యలు ఉన్నాయని ఈ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. న్యాయపరమైన చిక్కులు,కుటుంబ తగాదాల నేపథ్యంలో వినతుల పరిష్కారం ఆలస్యం అగుచున్నదన్నారు. రానున్న మూడు నెలలు పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక



మిగతా 2లో

## కోట్ల విలువ చేసే మా భూమిని కాజేసేందుకు ఎమ్మెల్యే అన్న కుమారుడు శివ ప్రయత్నం

**గుండాలతో వచ్చిన ఎస్పీడీసీఎల్ ఏఈ రజనీకాంత్**

**న్యాయం చేయండి మహాప్రభో..**

**విలేకరుల సమావేశంలో శ్రీమన్నారాయణ**



5లో



## అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 372 అర్జీలు**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీఏర్పాటుతో, వచ్చిన అర్జీదారులకు తాగునీటి సౌకర్యం కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీఓలు తహసీల్దారులు,

మిగతా 2లో

## సముద్రంలోకి 540 ఆలీవ్ రిడ్లీ తాబేళ్ళ పిల్లలు

**వాకాడు, మేజర్ న్యూస్:** వాకాడు మండలం నవాబుపేట సముద్ర తీరంలో సోమవారం జిల్లా ఫారెస్టు ఉన్నత ధికారుల ఆదేశాల మేరకు ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, సిబ్బంది ఆలీవ్ రిడ్లీ తాబేళ్ళ పిల్లలను సముద్రంలో విడిచి పెట్టారు. ఈ ఏడాది ఐదో దఫా నవాబు పేట వద్ద ఉన్న తాబేళపిల్లల సంరక్షణ కేంద్రం(హేచరీ)లో దాదాపు 585 గుడ్లును సేకరించి పొదగడం జరిగింది. అందులో 540 పిల్లలు ఆరోగ్యంగా బయటకు వచ్చాయి. వాటిని పలు



జాగ్రత్తలతో ఫారెస్టు అధికారులు సముద్రంలో విడిచి పెట్టారు. మానవుని మనుగడకు ఎంతో దోహదపడే తాబేళ్లను చంపినా, వేటాడినా చట్టరీత్య నేరమని అధికారులు తెలిపారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** ఏర్పేడు మండలం ప్రాథమికోన్నత పాఠశాల పాతవీరాపురంలో సోమవారం వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులు శ్రద్ధతో చదువు కోవాలని జ్ఞాన సముపార్జనే విద్యార్థి అంతిమ లక్ష్యంగా ఉండాలని చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు నేర్చుకోవాలని, పాటించాలని, భావితరాలకు అందించే వారదులుగా నిలబడాలని పిలుపునిచ్చారు.పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు అనేక బహుమతులు అందిస్తూ పాఠశాల వార్షికోత్సవానికి పదివేల రూపాయలు విరాళంగా అందించారు. పెనుమల్లం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి కూడా రమేష్ నాథ్ హాజరై నాలుగు వేల రూపాయలు పాఠశాల వార్షికోత్సవానికి అందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి ఉపాధ్యాయులు డాక్టర్ దేవరాజులు, పద్మజ, ఉషారాణి, శ్రీహరి, సూర్య నారాయణ, హెప్సి బారాణి, పెనుమల్ల ఉపాధ్యాయులు బాలాజీ. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## హరి ప్రసాద్‌ను కలిసిన జనసేన మండల అధ్యక్షుడు

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ను తిరుపతి జిల్లా సత్యవేడు జనసేన మండలాధ్యక్షుడు రూపేష్ కుమార్ కలిశారు. సోమవారం పసుపులేటి హరిప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతి పార్టీ కార్యాలయంలో జనసేన అధ్యక్షులు రూపేష్ కుమార్ కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్‌కు పూలమాలవేసి సాలువతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేనా పార్టీ సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి కొప్పుల లావణ్య కుమార్, కార్యదర్శి దాసు హేమ కుమార్ మండల కమిటీ నాయకులు జనరల్ సెక్రటరీ మునికుమార్ ప్రసన్న,సెక్రటరీ వెంకయ్య అనిల్ శ్రీనివాసు ధనుష్ పవన్ జనసైనికులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో విరివిగా చిన్నారులు

**గూడూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను మందస్తుగా చేరుస్తున్నారు. అంగన్‌వాడి పాఠశాలల్లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులను ఆయా పాఠశాలల్లో ర్యాలీగా తీసుకెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలల్లో చేర్చారు. ప్రభుత్వం గ్రామాల్లో పాఠశాలలు పునర్వవస్థీకరించడంతో పాటు మోడల్ పాఠశాలలుగా మార్చి ఇంగ్లీష్ మీడియం బోధనకు చర్యలు తీసుకుంది. వల్లిపేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండు అంగన్‌వాడి పాఠశాలల నుంచి దాదాపు 25 మంది చిన్నారులు చేరడం విశేషం. ప్రధానోపాధ్యాయులు జగదీష్, ఉపాధ్యాయురాలు పద్మజ సమక్షంలో అంగన్‌వాడి కార్యకర్తలు పరమేశ్వరి, వాణిలు విద్యార్థులను చేర్చారు.



## నరసింహ యాదవ్‌కి వినుత శుభాకాంక్షలు

**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్:** టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ ఇటీవల ఆంధ్ర రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి వినుత కోటా మర్యాద పూర్వకంగా తిరుపతి లోని వారి నివాసం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న యాదవ సోదరులు అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.



# గుంట పోరంబోకు భూమి కబ్జా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం

(మొదటిపేజీ తరువాయి)

పోరంబోకు, గ్రామ కంఠం, చెరువులు. గుంటలు లాంటి ఖాళీ భూమి కనబడితే, ఖాతాలు మార్చడం అతని నైజాం, కబ్జా చేసేది వైసిపి వైనంగా మారింది. తొట్టంబేడు రెవెన్యూ సర్వే నెంబర్ 89/1లో 1 ఎకరా 24 సెంట్లు గుంట పోరంబోకు భూమి కలదు. ఈ గుంట గత 50 సంవత్సరములు నుండి రామచంద్రా పురం గ్రామం తూర్పు భాగంలో ఉన్నది. ఈ భూమీ గత వైసిపి ప్రభుత్వం అధికారం లో ఉన్నప్పుడు ఈ గుంట చదును చేసి, 30 ప్లాట్లు వేయడం జరిగింది, ఒక ప్లాటు 25 అంకణలు ఒక అంకణం ఖరీదు ఒక లక్ష 25 వేలు రూపాయలు. 1,25,000. ఒక ప్లాట్ ఖరీదు 31,25,000. 30 ప్లాట్ల ఖరీదు 9.37.50.000 ఇందులో ఎవ్వరు ఎవరి వాటా ఎంత అనేది చెప్పకనే చెప్పు కోవచ్చు. గత వైసిపి ప్రభుత్వంలో గత ప్రభుత్వంలో రాత్రుల్లో చీకటి వ్యాపారం చేసి. రికార్డులు తారుమారు చేసి. దొంగ రికార్డులు సృష్టించి గుంట పోరంబోకు భూమిని సెటిల్మెంట్ భూమిగా మార్చడం జరిగింది. అడిగిన వారికి లంచాలు ఇవ్వడం జరిగింది. ఈ గుంట పోరంబోకు భూమిపై తొట్టంబేడు తహసిల్దర్ ని వివరణ అడగగా కొద్ది రోజులు క్రితం ఈ భూమిలో ఎవ్వరు ప్రవేశించ కూడదని ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏ భూమిలో ఇటువంటి కట్టడాలు నిర్మాణాలు చేయ కూడదని బోర్డులు పెట్టడం జరిగిందని అన్నారు. గుంట పోరంబోకు భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన. అక్రమ కట్టడాలు నిర్మించిన. చట్ట పరమైన చర్యలు తీసు కుంటామని తెలిపారు. శ్రీశ్రీకాళహస్తి రాజీవ్ నగర్లో శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్ నగర్ ప్రాంతంలో వైసీపీ దళారులు మాజీ బోర్డు మెంబర్లు. మాజీ ఎమ్మెల్యేకి పిఏగా వ్యవ హరించిన ప్రభుత్వ టీచర్ గుణశేఖర్ రెడ్డి విచ్చల విడిగా పేదలు ప్లాట్లు రాత్రికి రాత్రి



చదును చేసి విక్రయించడం జరిగింది. ఒక ప్రభుత్వ కొన్ని ప్రాంతాలలో ప్రభుత్వ భూములు. పేదలు ప్లాట్లు బేస్మెంట్లు. స్లాబ్ వేసిన ఇల్లులు కూలా గోట్టి రౌడిజం చేసి అడ్డొచ్చిన వారిని ప్రక్క దోసీ లచ్చిలాది రూపాయలు ఒక బోర్డు మెంబర్ వివాహానికి ఇవ్వడం జరిగిందని బహి రంగంగా చెబుతున్నారు. బాధితులు కూలా కొడుతుంటే అడ్డు కోగా మీవల్ల అయింది చేసు కోండి. ఇది ఎమ్మెల్యే ఆర్డర్ అని ఒక మైనారిటీ నాయకుడు హెచ్చరించడం జరిగింది. బాధితులు రెండు సంవత్సరాలు క్రితం మాజీ ఎమ్మెల్యేకి బాధితులు పలు దపాలు మొర పెట్టకున్నా ఫలితం లేకుండా పోయింది. వేరే ప్రాంతంలో చూసుకోండి అని ఉచిత సలహా ఇవ్వడం జరిగింది. కొంతమంది వైసీపీ దళారులు వలన చోటా రాజకీయ నాయకులు వలన వైయస్సార్ పార్టీ భారీ మూల్యం చెల్లించు కున్నదని శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలు. మేధావులు చర్చించు కుంటున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి శ్రీకాళహస్తి భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు.

# భూ సమస్యల పరిష్కారమే ప్రత్యేక అజెండా ముందుకు సాగుతున్నా

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి ముఖ్యంగా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చూపడం జరుగుతుందన్నారు. వినతుల పరిష్కారానికి అధికారులకు సరిపడా సమయం ఇస్తున్నామని నాణ్యమైన పరిష్కారం చూపుతామన్నారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుండి జిల్లా కేంద్రంకు వచ్చి సమస్యలను విన్నవించడానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇదొక సదవకాశమని పేర్కొన్నారు. జిల్లాలో పి జి ఆర్ ఎస్ ద్వారా 53 వేల వినతులు అందగా అందులో 12 వేల అర్జీలు కుప్పం నియోజకవర్గం నుండి అందాయని, క్రమంగా కుప్పంలో పర్యటించి సాధ్యమైనంత సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. అదే తరహాలో మిగిలిన నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టామన్నారు. పలమనేరు ఎం ఎల్ ఏ మాట్లాడుతూ.... ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణ పూర్తిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన అని గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇదే విధంగా అధికార యంత్రాంగాన్ని ప్రజల దగ్గరకు పంపి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపేలా చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు.

పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలో గల ప్రజల సమస్యలను స్వీకరించ దం జరిగిందన్నారు. పుంగనూరు లో గతంలో జమీందారీ వ్యవస్థ ఉండడం, పలమనేరులో కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయని, జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పలమనేరు డివిజన్ కేంద్రంలో రానున్న మూడు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఈ సదవకాశాన్ని పలమనేరు డివిజన్ ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి అని, పెండింగ్ అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బందికి రసీదులు అందించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు...** రెవెన్యూ -260, పౌర సరఫరాల శాఖ-4, పోలీస్-13, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -10, స్కిల్ డెవలప్మెంట్ -1, ఐటిఐ -2, పంచాయితీ రాజ్-21, కో ఆపరేటివ్ సొసైటీ - 1, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ - 1, రూరల్ డెవలప్మెంట్ - 7, ఎండోమెంట్ -3, స్కూల్ ఎడ్యుకేషన్-7, రూరల్ పావర్టీ - 7, ఎస్ వి మెడికల్ కాలేజ్ -1, ఎస్ సి కార్పొరేషన్ - 2, బిసి కార్పొరేషన్ - 2, జాతీయ రహదారులు - 4, టిటిడి -2, హార్టికల్చర్ -1 సర్వే -9, ఐ సి డి ఎస్-2, అటవీ శాఖ - 1, రిజిస్ట్రేషన్ శాఖ- 2, నీటి వనరుల శాఖ -2, పబ్లిక్ హెల్త్ - 2, ఏపీఐఐసీ- 2, గనుల శాఖ - 1, ఆర్టీసీ -1 మొత్తం 372 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



## స్కూల్ పిల్లలకు ఉచితంగా బ్యాగుల పంపిణీ

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** భారతీయ జనతా పార్టీ కార్యకర్త అయిన శివయ్య బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆదిత్య హోటల్లో సోమవారం స్కూల్ పిల్లలకు ఉచితంగా స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ బీజేపీ అధ్యక్షులు జగదీష్‌రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పౌరసేవా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంత సహాయం పేదలకు అందివాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లికా రాణి సీనియర్ నాయకులు మణి మొదలియార్ డాక్టర్ జగన్నాథం, టీవీఎస్ ప్రసాద్, చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## తిరుచ్చి వాహనంపై ఊరేగిన ఉత్సవమూర్తులు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో వసంత ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం ఆలయంలో ఉత్సవమూర్తులకు పెరుగు, తేనె, హరిద్రవం, చందనం పసుపు పాలు తొక్కుడిన తిరుమంజను నిర్వహించారు. అనంతరం ఆలయంలో వేద పండితులు మధ్య ఆస్థానం వైభవంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల్ స్వామి, సీత లక్ష్మణ సమేత కోదండరాం స్వామి వారు ఉత్సవ మూర్తులు పురవీధుల్లో సర్వాంగ సుందరంగా అలంకరించి వేదపండితులు మంత్రోచ్ఛారణ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీవో నాగరత్నమ్మ, సూపరిటెంట్ మునిశేఖర్ ఆలయ అధికారి సురేష్ కుమార్ సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: సర్పంచ్

**ఏర్పేడు, మేజర్‌న్యూస్:** ఏర్పేడు మండలం యండి పుత్తూరు గ్రామంలో సర్పంచ్ మోహన ప్రియ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వెన్నెలకంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించబడునని ఈ వైద్య శిబిరంలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించబడును. కావున యండి పుత్తూరు గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామస్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని తెలియజేశారు.



## ఎస్వీ గోశాలకు కూలర్లు అందజేత

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** సోమవారం జనసేన నేత కిరణ్ రాయల్ తిరుపతి ఎస్వీ గోశాలకు కూలర్లను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు గోవులు అంటే ఎంతో ఇష్టమన్నారు. కొద్దిరోజులుగా నోరులేని గోవులపై అసత్య ప్రచారాలు చేయటం చాలా బాధాకరమన్నారు. పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఈరోజు గోశాలకు నాలుగు ఎయిర్ కూలర్లను అందించామని తెలియజేశారు. గోవుల సంరక్షణ కోసం మంచి మనసుతో దాతలు ముందుకు రావాలని కిరణ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్, మనోజ్, వంశీ, లోకేష్, పురుషోత్తం, దేవ, ముని, నవీన్ సాయి, రాహుల్‌లు పాల్గొన్నారు.



## మే 1 నుండి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** మే నెల ఒకటవ తేదీ నుండి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పలమనేరులోని సొంత కళామందిరంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పుష్ప తెలిపారు. తెలుగు భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు రోజుకో పద్యం నేర్పిస్తామన్నారు. నీతి కథల ద్వారా విలువలు పెంపొందిస్తామన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను ఈనెల 26వ తేదీ లోపు 9553429770 నంబర్ కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. పిల్లలు రెండవ తరగతి నుండి ఏడవ తరగతి లోపు వారై ఉండాలన్నారు.



## శాంతస్ఫూర్తి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత జాబ్ మేళా

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఈనెల 24వ తేదీ ఉదయం 11:30 గంటలకు స్థానిక తనపల్లి రోడ్డులోని తాజ్ హోటల్‌లో శాంతస్ఫూర్తి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత జాబ్ మేళా కోసం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోకాచారి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికోసం విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ (పాస్ ఆర్ ఫెయిల్) ఉండి తిరుపతి, పరిసర ప్రాంతాల అభ్యర్థులకు అవకాశం ఉంటుందన్నారు. వీరి వయసు18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థి తన ఆధార్ కార్డు, పదవ తరగతి మార్క్స్ లిస్ట్, ఇంటర్మీడియట్ మార్క్స్ లిస్ట్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటో, వ్యక్తిగత ఫోన్ నెంబర్ జతపరచాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9000469989 (శాంతస్ఫూర్తి సేవా ఫౌండేషన్) నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

## మెగాజాబ్ మేళ గోడపత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా సత్యవేడు శ్రీదాస్ ఆర్ట్స్,సైన్స్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25వ తేదీన జరగనున్న జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రికలను స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించడం జరిగింది. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంగణంలో సత్యవేడు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి ఆధ్వర్యంలో జాబ్ మేళ పోస్టర్లు ఎమ్మెల్యే ఆదిమూలం స్థానిక నేతలు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రతినెల ఉద్యోగమేళా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడానికి పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఇందులో భాగానే మెగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తూ నిరుద్యోగుల ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అయితే చదువుకున్న నిరుద్యోగులు కూడా వారి నైపుణ్యాన్ని అనుసరించి ఉద్యోగ అవకాశాలను అందుపుచ్చుకోవాలన్నారు. అలాగే దాసు సైన్స్ కళాశాలలో నిర్వహించే ఉద్యోగమేళాకు చెన్నై, శ్రీసిటీకి సంబంధించిన 16 కంపెనీలకు సంబంధించి 800 పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్య అధిక సంఖ్యలో నిరుద్యోగులు వచ్చేల చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ మురళి, ఎస్సై రామస్వామి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ రవి, దాసుడిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పరంధాం, టిడిపి మాజీ మండలాధ్యక్షుడు పరమ శివం, మురళి, శశిమోహన్నాయుడు, ప్రభాకర్ రెడ్డి, జక్కల శివానందం, గణేష్, రాధాకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు రూపేష్ కుమార్ పాల్గొన్నారు.



## టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షులుగా మయూరి

**గూడూరు, మేజర్‌న్యూస్:** టెన్నికాయిట్ తిరుపతి జిల్లా అధ్యక్షులుగా మయూరి శ్యామ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక తిరుపతి పట్టణంలోని అను ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ నందు స్టేట్ అబ్జర్వర్ యన్.టి.ప్రసాద్, డీఎస్‌డిఓ షేక్ సయ్యద్ సాహెబ్, రిటర్నింగ్ ఆఫీసర్ ( అడ్వకేట్ ) డాక్టర్. సి.చంద్రశేఖర్‌ల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా మయూరి శ్యామ్, ఉపాధ్యక్షులుగా పైడి కోటేశ్వరరావు మరియు కావలి మల్లికార్జున్‌ను సెక్రటరీగా గెరిటి చెంచయ్య, జాయింట్ సెక్రటరీలుగా గూడూరు రమేష్, బూదూరు రాంబాబులను ట్రెజరర్‌గా బుసగాని మహేష్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కటారి అరుణ్ కుమార్, చాట మునిరాజు, సిహెచ్ విజయలక్ష్మి, హెచ్ జగదీశ్వరరావు, మంజులను ఎన్నుకోవడం జరిగింది.




## మహిళలకు చీరల పంపిణీ

**వాకాడు, మేజర్ న్యూస్:** తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామంలోని పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ముసునూరు మస్తాన్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో 35 మంది మహిళలకు 45 వేల రూపాయల విలువ చేసే చీరలను ఆలయ ధర్మకర్త, వాకాడు సొసైటీ మాజీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. దామోదరరెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా నేడు మహిళలకు చీరలను అందజేయడం ముదావహమని దాతలను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లింగారెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మమత, బిరదవోలు సరిత, కోడివాక రంగయ్య స్వామి, సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, వంశీ ప్రియ, సుశాంతి, శిరీష, రమాదేవి, నాగమానిక, అరసి నరేష్ శర్మ, పవన్, లోకేష్, శేషాద్రి, తేజ, మణికంఠ, వాసు, శేషాచార్యులు, చలపతి స్వామి పాల్గొన్నారు.



## కోతలగుంటలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణ

### తేనెటీగలు దాడిలో గాయపడ్డ పలువురికి వైద్య సేవలు
### అధికారుల సహాయక చర్యలపై గ్రామస్తుల హర్షం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** చిట్టమూరు మండలం ఈశ్వరవాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో



కోతలగుంటలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవలందించారు. శని,ఆదివారాలలో తేనెటీగల దాడిలో గాయపడ్డ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి,మందులు,మాత్రలు పంపిణీ చేశారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారు,ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని తగిన మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్య సేవలను అందిస్తామని డాక్టర్ విజయ్‌కుమార్ స్థానికులకు తెలిపారు. తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నరసయ్య, వెంకటరమణయ్యలకు ప్రత్యేక చికిత్స అందించారు.వైద్య శిబిరం ఏర్పాటుకు ముందు తెల్లవారుజాము సమయంలో గాయపడ్డ కొంతమందికి రక్తస్రావం కావడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లినట్టు తెలిపారు.కాగా తమ గ్రామంలో తేనెటీగల దాడి జరిగిందని తెలిసిన వెంటనే ఎంపీడీవో మనోహర్ గౌడ్,ఎస్ఐ చిన్న బలరామయ్యలు హుటా హుటిన గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి,ధైర్యం చెప్పి,తేనె తుట్టెలను తొలగించి అండగా నిలిచారని, వైద్యాధికారులు సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేసి, కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి అహ్మద్ భాషా, సూపర్వైజర్ షేక్ అలీమ్ భాషా, ఫార్మసిస్ట్ మస్తాన్ బాబు, రవి, ఏఎన్ఎం నాగ భూషణమ్మ, ఆశా కార్యకర్త లావణ్య,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ ఆమరయ్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 9 మంది తమ సమస్యలు తెలుపగా, 24 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ భూపాల్ హౌసింగ్ కాలనీలో వెల్డింగ్ షాపు వలన వచ్చే శబ్దాలతో ఇబ్బందిగా ఉందని,అక్కారం పల్లిలో మూసివేసిన కాలువలు వినియోగంలోకి తేవాలని, కుక్కల బెడద తగ్గేలా చూడాలని, చంద్రశేఖర్ రెడ్డి కాలనిలో యూడీఎస్ కాలువ బ్లాక్ అవుతున్నది శాశ్వత పరిష్కారం చూపాలని, శ్రీకృష్ణ నగర్ లో తుడా ఉద్యోగి రోడ్డు ఆక్రమించి గోడ కట్టారు చర్యలు తీసుకోవాలని, నీటి కనెక్షన్ లేకున్నా బిల్లు వస్తోంది పరిష్కరించాలని, రైతు బజారు వద్ద రోడ్డుపై అమ్మకాలు చేస్తుండడంతో రైతు బజారులో వ్యాపారాలు జరగడం లేదు పరిష్కరించాలని, తిలక్ రోడ్డు, రెడ్డి అండ్ రెడ్డి కాలనీల్లో మురుగు కాలువలు పూర్తిగా పాడయ్యాయి బాగు చేయాలని, కోరమేనుగుంటలో గిఫ్ట్ డీడ్ ఇచ్చినా టిడిఆర్ బాండ్ ఇవ్వలేదని, సిపిఆర్ అపార్ట్మెంట్ వద్ద కాలువపై బండలు తొలగించడంతో చెత్త వేస్తున్నారు పరిశీలించాలని, మురుగు కాలువలు శుభ్రం చేయాలని కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డి.ఈ.లు, ఏసిపిలు, తదితరులు ఉన్నారు.





## పీజీఆర్ఎస్ కు 11 ఫిర్యాదులు : కమిషనర్

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్థానిక నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 11 సమస్యలు వచ్చినట్లు నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్వో డా లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపీ విరామ సమయంలో టీటీడీ మాజీ జేఈవో శ్రీనివాసరాజు, సినీ దర్శకుడు గోపిచంద్ మల్లినేని, సంగీత దర్శకుడు థమన్, సినీ కథానాయకుడు అశ్విన్ బాబులు స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రాలు సత్కరించారు.





## శ్రీవారి సేవలో సుప్రీమ్ కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని సుప్రీమ్ కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దర్శించుకున్నారు. సోమవారం విఐపీ విరామ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రాలు సత్కరించారు.



## నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపే కూటమి ప్రభుత్వం

- మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదలే దీనికి నిదర్శనం
- మాట నిలబెట్టుకున్న ఏపి.సియం చంద్రబాబు
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం.., మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపేందుకు సిద్ధమైందనీ..ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా.. కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సి నోటిఫికేషన్ను విడుదల చేసింది..ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీను నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధిని సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో అభినందినలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రకాల అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేనిది అన్నారు. మరీ ముఖ్యంగా నిరుపేదలు లేని సమాజ స్థాపనే ఆయన లక్ష్యమని చెప్పారు. అదేసమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టి.., తాజాగా మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి..,16347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి కంకణం కట్టుకోవడం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతకు నిలువెత్తు నిదర్శనం అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రశంసించారు. ఇకపోతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.., విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు., ఇందులో కీలక పాత్ర పోషించి.., రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమన్నారాయన. 2047 విజన్ తో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజా దీవెనలు మెండుగా ఉన్నాయన్నారు.

## ప్రత్యేక అలంకరణలో శ్రీకొండ మల్లీశ్వరస్వామి

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని మాంబేడు పంచా యితీ డిఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కొండ మల్లీశ్వర స్వామికి అభిషేక పూజలు చేశారు.సోమవారం శ్రీ కొండమల్లీ శ్వర స్వామినిప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనం తరం అక్కడే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్యనిర్వహులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజే శారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. అన్నమయ్య కీర్తనలతో భక్తులను అలరింపజేశారు.



## ఆరేళ్ల కల సీఎం చంద్రబాబుతో సాకారం

- శాప్ ఛైర్మన్ రవినాయుడు
- డీఎస్సీ విడుదల పట్ల కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు
- చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** డీఎస్సీ అభ్యర్థుల ఆరేళ్ల కలను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లు సాకారం చేశారని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం డీఎస్సీని విడుదల చేసి ఇది మంచి ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకుందన్నారు. ఈ సందర్భంగా సోమవారం తిరుపతి ఆర్డీఓ ఆఫీసు ఎదుట డీఎస్సీ విడుదల సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులతో కలిసి చంద్రబాబు, లోకేష్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సర్, లోకేష్ అన్న అంటూ ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో అభ్యర్థులతో కలిసి అనేక నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలులేవన్నారు. అభ్యర్థులు ఆర్తనాదాలు పెట్టినా స్పందించలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు, లోకేష్‌లు నెరవేర్చి అభ్యర్థులకు అండగా నిలిచారన్నారు. అన్ని కేటగిరీలకు న్యాయం జరిగేలా డీఎస్సీ రూపొందించారన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ డీఎస్సీ విడుదల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని, అన్న విధంగానే సంవత్సరంలోనే 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆరేళ్లుగా నిరీక్షించి అలసిపోయిన అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మాజీ సీఎం జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర సభ్యులు ఆర్కే నాయుడు, విష్ణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్ : వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ లోని సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , సంబంధిత అధికారులతో కలిసి వైజాగ్ చెన్నైఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో భాగమైన పలు ఇండస్ట్రియల్ కారిడార్ కు సంబంధించిన భూసేకరణ పనులు, రోడ్లు తదితర అంశాలపై విసిఐసి, రెవెన్యూ, ఏపీఐఐసీ , ఆర్ అండ్ బి శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు అభివృద్ధి పనులకు సంబంధించిన సంబంధించి నాయుడుపేట, మేనకూరు మండలాలకు సంబంధించిన ఏడు గ్రామాలలో భూ సేకరణ పెండింగ్, రోడ్లు పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ మధుసూదన్ రావు, సంబంధిత మండలాల తాసిల్దారు పాల్గొన్నారు.



## విభూది అలంకరణలో శ్రీ కాలభైరవ స్వామి



**నగరి, మేజర్‌న్యూస్:** నగరిలో వెలసి యున్న శ్రీ కాలభైరవ స్వామి సోమ వారపు అష్టమి పూజలు అతి వైభవముగా జరిగాయి. స్వామివారికి, పాలు, పెరుగు ,పంచామృతం ,పన్నీరు, చందనము ,కొబ్బరినీరు, మొదలగున వాటితో విశేషముగా అభిషేక కార్యక్రమాలు జరిగాయి ప్రత్యేకముగా సిద్ధం చేసి ఉన్న కలశములతో పూజలు చేసి స్వర్ణాభిషేకం జరిగాయి. అభిషేకానంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణగా విభూది అలంకరణ భక్తులు ఆకర్షించాయి పట్టణంలో భక్తులే కాక పరిసర ప్రాంతంలోని భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అభిషేక పూజలందు పాల్గొన్న ఉభయ దారులకు ప్రత్యేక సంకల్ప పూజలు చేసి ఆలయ ప్రసాదాలు అందించారు.

## మోహిత్ రెడ్డిని కలసిన మండల వైసీపీ నాయకులు



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కమిటీలు కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించడంతో పార్టీ పదవులు పొందిన నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజక వర్గ ఇన్చార్జీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కలసి కృతజ్ఞత తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు యద్దల చంద్రశేఖర్‌రెడ్డి, భానుప్రకాష్ రెడ్డిల ఆధ్వర్యంలో మండల పార్టీ కమిటీ, గ్రామ కమిటీ, అనుబంధ కమిటీల నేతలు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గజ మాలలతో సత్కరించారు. పార్టీలో మంచి అవకాశం ఇవ్వడం అదృష్టంగా బావిస్తున్నామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ప్రతి గ్రామంలో పటిష్టం చేస్తామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా చేసి పార్టీని బలోపేతం చేస్తామని వెల్లడించారు. అనంతరం మోహిత్ రెడ్డి మాట్లాడు తూ పదవులు తీసుకున్న ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి పార్టీ కార్యక్రమాలలో విరివిరిగా పాల్గొనాలని తెలిపారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అవినీతి, అక్రమాలను ఎప్పటికి అప్పుడు ఎండ గట్టాలి అని సూచించారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సహకారా లైనా అందిస్తామని, పార్టీకి ప్రతి ఒక్కరి అండ దండలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య



**గుడిపాల, మేజర్ న్యూస్:** ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యను అందిస్తున్నారని ప్రతి ఒక్క తల్లిదండ్రు గమనించి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో తమ పిల్ల లను చేర్పించాలని నరహరిపేట జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ టి ఆర్ ఢిల్లీ బాయ్, ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం మండలంలోని రామ్ భద్రపురం పంచాయతీలో కన్వాసింగ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల కళాశాలలో ప్రభుత్వం అనేక సౌకర్యాలు చేయడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు పెద్దపీట వేస్తుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్.వెంకటేశులు ఇతరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు ఉచిత వ్యాక్సినేషన్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** హజ్ యాత్రికులకు ఈనెల 22 వ తేదీన చిత్తూరు నగర పరిధి లోని టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ నందు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉచితంగా జరుపబడునని కావున యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులు ఆడ,మగ,మరియు పిల్లలకు ఉచిత వ్యాక్సినేషన్ సౌకర్యమును వినియోగించు కోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ హనుమంతరావు సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు.

## తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



**పుంగనూరు మేజర్‌న్యూస్:** పుంగనూరులో ప్రతి సోమవారం జరిగే సంతలో ఓ ఆరేళ్ల బాలిక తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి పట్టణంలోని కొత్తపేటలో నివాసముంటున్న శోభారాణి సోమవారం సంతకు తన ఆరేళ్ల కుమార్తెతో వచ్చింది అయితే నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే సమయంలో బాలిక తప్పిపోయింది బాలిక కనిపించకుండా పోవడంతో తల్లి శోభారాణి ఆర్తనాదాలు చేస్తూ ఎంత వెదికినా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తల్లిదండ్రులు కిషోర్ శోభారాణిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్ ఐ లోకేష్ తన సిబ్బందితో పట్టణంలో గాలిస్తుండగా బాలిక ఆచూకీ లభ్యమైంది బాలికను వెంటనే పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పుంగనూరు పోలీసులను పట్టణ ప్రజలు ప్రశంసలు కురిపించారు.

## బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న గ్రామాలలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల చేర్పించాలని, పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సేవలు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడం కోసమే ప్రచార నిర్వహించినట్లు ఆయన తెలిపారు.



## వేదికకు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకట శివ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమ, వెంకట శివ, చిత్తూరు ఆర్డీ ఓ శ్రీనివాసులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీజీఆర్ఎస్ కార్యక్రమం లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.

## చదువులు తల్లికి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి అర్బన్ మేజర్ న్యూస్:** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించినటు వంటి ఎ భావన అను విద్యార్థిని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ అత్యంత పేద కు టుంబంలో పుట్టి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించ డం చాలా గొప్ప విషయమని ప్రతి విద్యార్థి అదేవిధంగా చదివి వారి గురువులకు వారి తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని భావి భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి ఆర్టీఐ : రాష్ట్ర అధ్యక్షులు



**బంగారుపాళ్యం, మేజర్ న్యూస్:** మండలానికి చెందిన ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షులు జొన్నావుల సురేంద్ర సోమవారం ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమం పై మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పోరాడే వేదికల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, నిజంగా ప్రభావవంతంగా పనిచేసే సంస్థలు మాత్రం అరుదు అని తెలిపారు. అలాంటి సంస్థల్లో అగ్రగామిగా నిలుస్తోంది ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్. ఈ సంస్థ గవర్నమెంట్ అధికారులకు ఇబ్బందులు కలిగించకుండా, ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా తటస్థంగా పనిచేస్తోంది.ఆర్.టి.ఐ చట్టం ద్వారా సమా చారం పొందడం ద్వారా సామాన్య ప్రజానీకానికి స్వచ్ఛమైన పాలన గురించి అవగాహన పెంచే దిశగా ఈ సంస్థ నిరంతరం కృషి చేస్తోంది. ప్రజల హక్కులను సమర్థవంతంగా కాపాడటంలో, ప్రభు త్వ పాలనలో పారదర్శకత తీసుకురావడంలో ఈ సంస్థ పాత్ర ఎంతో గొప్పది. ఇది అధికారుల పనితీరుపై దాడి చేయడం కాదు, గానీ వారి విధుల్లో ఉండే లోపాలను పద్ధతిగా వెల్లడించి, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం. ప్రభుత్వ శాఖలు, అధికారులు, ప్రజల మధ్య వారధిగా నిలబడి ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ పని చేస్తోంది.ఈ సంస్థ వెనుక ఉన్నదీ ఒక స్పష్టమైన లక్ష్యం సమాజానికి సమాన న్యాయం అందించాలి. "ప్రతి పౌరునికి గౌరవం కలిగే విధంగా పాలన జరగాలి" అనే ధ్యేయంతో ముందు కెళ్తోంది. పలు సంఘటనల్లో ప్రజల సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లిన ఈ సంస్థ, వాటిని పరిష్కరించే దిశగా గవర్నమెంట్ యంత్రాంగాన్ని కార్యాచరణలోకి తేవడంలో విజయవంతమైంది. ఇది సంస్థ విశ్వసనీయతకు నిదర్శనం. పారదర్శకత, న్యాయం, సామాజిక బాధ్యత అనే విలువలతో ముందుకెళ్తున్న ఆర్.టి.ఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ ఇంకా మరెన్నో జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆశయంతో సాగుతోందని రాష్ట్ర అధ్యక్షులు జన్నావుల సురేంద్ర ఒక ప్రకటనలో తెలియజేశారు.

## 25 మందితో కొత్త కమిటీ ఎన్నిక



**పలమనేరు మేజర్‌న్యూస్:** ఎమ్మెల్యే ఎన్. అమర్నా థరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం తెలుగుదేశం పార్టీ కొలమాసనపల్లి నూతన కార్యవర్గాన్ని మండల నాయకుల సమక్షంలో ఎన్నుకు న్నారు. కొలమాసనపల్లి పంచాయతీ అధ్యక్షునిగా హేమ సుందరం (బాబు) ను ఎన్నుకోగా కార్యదర్శిగా బాలచంద్రారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలుగు యువత అధ్యక్షులుగా వెంకటేష్ కు అవకాశం కల్పించారు. ఈ కొత్త కమిటీలో సభ్యులు పార్టీ కోసం పనిచేసిన 25 మందికి చోటు కల్పించారు. వీరిని ఎన్నుకోవడంతో పలువురు వారికి అభినందనలు తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సెల్వరాజ్, జగదీష్ నాయుడు, అధ్యక్షులు నాగరాజు రెడ్డి, రామ్మూర్తి, బాబు తోపాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గుడిపాల మేజర్‌న్యూస్ :** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండ లంలోని గొల్లమడుగు వద్ద ఉన్న లక్ష్మీ నరసింహ కాలేజ్ ఆవరణంలో సోమ వారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు గుర్తుతెలియని వ్యక్తి మానసిక పరిస్థితి బాగోలేదని దీంతో అక్కడ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఉన్నట్లుండి స్పృహ తప్పిపోయి పడిపోయాడని దీంతో అతను మృతి చెందారని అక్కడి ప్రజలు తెలిపారు. ఇతను వయసు సుమారు 50 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. ఆహారము ఏమి తీసుకోకపోవడంతో తీవ్ర ఎండ ఉండడంతో ఉన్నట్లుండి కుప్పకూలి ప్రాణాలు విడిచినట్లు స్థానికులు తెలిపారు.

## చౌడేశ్వరి దేవి వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



**పుంగనూరు, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని చదళ్ళ గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి వార్షికోత్సవ పోస్టర్లను బుధవారం ఎన్ వి ఆర్ ట్రస్ట్ అధినేత జనసేన నేత ఆలయ ధర్మకర్త ఎన్ వేణుగోపాల్ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం నిర్మాణం జరిగి ఎనిమిది సంవత్సరాలు పూర్తి కావడంతో ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయన్నారుబుధవారము నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు నిత్య పూజలు హెూమాలు అలంకరణలు మహా మంగళ హారతులు జరుగుతాయన్నారు ఎన్.వి.ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలలో ప్రతిరోజు మధ్యాహ్నం రాత్రి వేళల్లో భక్తులకు అన్న ప్రసాదం వితరణ జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్న్ షిప్ విద్యార్థులకు సర్టిఫికెట్ లు ప్రదానం



**రొంపిచెర్ల, మేజర్ న్యూస్:** రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటర్న్ షిప్ చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ లను ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సు లపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. 10 వ తరగతి విద్యార్థులకు ఈ ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం లో భాగంగా ఒకేషనల్ ఎడ్యుకేషన్, రిటైల్ ట్రేడింగ్ పై అవగాహన కల్పించారు. విద్యార్థులు వృత్తి, విద్యా కోర్సుల్లో ప్రావీణ్యం పొందాలని అన్నారు. అలాగే కోర్సుల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం రీటైల్ ఇన్స్ట్రక్టర్ డి.శశి కుమార్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రిటైల్ ట్రేడింగ్ కు సంబంధించి అవగాహన పెంచుకుంటే మంచి ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోకనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల విలువ చేసే మా భూమిని కాజేసేందుకు ఎమ్మెల్యే అన్న కుమారుడు శివ ప్రయత్నం

### గుండాలతో వచ్చిన ఎస్పీడీసీఎల్ ఏఈ రజినీకాంత్ న్యాయం చేయండి మహాప్రభో..

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** కోట్ల రూపాయలు విలువచేసే తన భూమిని కాజేసేందుకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



అన్నకుమారుడు ఆరణి శివ, మనోహర్ కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని స్థల యజమాని శ్రీమన్నారాయణ రెడ్డి ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీమన్నారాయణ తన అడ్వకేట్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 3/2సీ,2వ21బీ, 3/2సీ 2వ2ఏ 1ఏ2లో ఉన్న శ్రీమన్నారాయణ వైఫ్‌ఆఫ్ స్వర్ణలతకు చెందిన కోట్ల రూపాయలు విలువ చేసే రెండు ఎకరాల భూమిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అరుణ కుమారుడు ఆరని శివకుమార్ మరి కొంతమందితో కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. 2003 నుంచి ఆ స్థలానికి సంబంధించి కోర్టు వివాదాల్లో ఉన్నప్పటికీ వాటిని క్లియర్ చేసుకుంటూ వచ్చామన్నారు. తిరుపతిలో కోట్ల రూపాయలు విలువ చేసే రెండు ఎకరాల భూమి ఎలాంటి నిర్మాణాలు లేకపోవడంతో ఎమ్మెల్యే సోదరుని కుమారుడు ఆరణి శివ కన్ను పడింది. దీంతో అధికార అంగబలంతో కాజేయాలని కొంతమంది అల్లరిమూకలతో కలిసి ఇప్పటికే అక్కడున్న గదిని కూల్చి వేశారని శ్రీమన్నారాయణ ఆరోపించారు. తిరుపతి ఎమ్మెల్యేగా శ్రీనివాసులు గెలుపు కోసం శివ 125 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని, ఆ డబ్బులు సంపాదించాలంటే ఇలాంటి పనులు చేయక తప్పదని తనతో వాదించినట్లు శ్రీమన్నారాయణ తెలిపారు. 2003 నుంచి ఇప్పటివరకు 9 జడ్జిమెంట్లు తమకు అనుకూలంగా వచ్చిన కోర్టులో కేసు నడుస్తోందన్నారు. అయితే ఆరణి శివ అధికార బలాన్ని అడ్డుపెట్టుకొని ఎలాగైనా కోట్ల రూపాయలు విలువ చేసే విలువైన భూమిని కాజేయాలని పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులను పెట్టుకుని విద్యుత్ మీటర్‌తో పాటు శ్రీవమన్నారాయణ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ వస్తున్నార్కన్నారు. ఆరని శివపై పలు అవినీతి ఆరోపణలతో పాటు నగరపాలక కార్యాలయం లో అధికారులపై పెత్తనం జలాయించడం, కాంట్రాక్టర్లను వారి దగ్గర ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. ఎస్పీడీసీఎల్ ఏఈ రజినీకాంత్ రెండు రోజుల క్రితం 20 మంది గుండాలతో స్థలం వద్దకు చేరుకొని అక్కడ ఉన్న గదికి విద్యుత్ మీటర్ను ఎలాగైనా తొలగించాలని దౌర్జన్యానికి దిగారని ఓ పోయారు. ఒక ప్రభుత్వ అధికారిగా ఉన్న రజనీకాంత్ గుండాలను తీసుకొచ్చి విద్యుత్ మీటర్ ను తొలగించే ప్రయత్నం చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో ప్రజలకే తెలియాలని పేర్కొన్నారు. ఏదిఏమైనా అరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే అన్న కుమారుడు ఆరని శివకుమార్‌పై ఇప్పటికే తిరుపతి నియోజక వర్గంలో పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఆయన చేస్తున్న దౌర్జన్యాలు ఆక్రమణలపై ప్రశ్నించే నాథుడే లేడా అని పేర్కొన్నారు. తమ భూమి ఆక్రమణపై ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు శ్రీమన్నారాయణ తెలిపారు. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని తన భూమిని కాజేయకుండా మమ్మల్ని కాపాడాలని శ్రీమన్నారాయణ మీడియా సమావేశంలో కోరారు.



# గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పెద్దపంజాణి మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుపుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవలసిన అధికారులు మామూళ్లతో ఏమీ పట్టనట్టు ఉన్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపంజాణి మండలంలో శంకర్రాయలపేట మరియు పెద్దపంజాణి రెండు వైన్ షాపులు ఉన్నాయి అయితే మండలంలో మొత్తం 25 పంచాయితీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో ఒకటి నుండి రెండు బెల్ట్ షాపులు అనధికారికంగా నడుపుతున్నారు. ఈ బెల్టు షాపులకు వైన్ షాపుల వారే మద్యం సరఫరా చేస్తుంటారు. వీరు ఒక్కో బాటిల్‌పై రూ.20లు అధికంగా వసూలు చేస్తే బెల్ట్ షాపు నిర్వాహకులు మరో రూ.20లు పెంచి మొత్తం ఒక బాటల్ పైన 40రూపాయలు అధికంగా గ్రామాల్లోనే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు ఎవరైనా సమాచారం అందిస్తే ఆ సమాచారం వెంటనే వైన్‌షాప్ యజమానులకు చేరిపోతుంది. దీన్నిబట్టి చూస్తే ఎక్సైజ్ అధికారులకు బెల్టుషాపుల నిర్వాహకుల మధ్య ఎంత అనుబంధం ఉందో అర్థమవుతుంది. ఎక్సైజ్ అధికారులకు కూడా మామూళ్లు అందుతున్నాయననే వాదన కూడా మండలంలో బలంగా వినిపిస్తోంది. మద్యం తాగే అలవాటు ఉన్న వారు క్వార్టర్ పై రూ.40లు అధికముగా చెల్లించి గ్రామాల్లోని కొనుగోలు చేస్తున్నారు. కూలి చేసి సంపాదించే నగదు అధిక మొత్తంలో బెల్ట్ షాపు నిర్వాహకులు మరియు వైన్ షాప్ సొమ్ము చేసుకుంటున్న ఏమీ పట్టనట్టు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై ప్రజలలో తీవ్రస్థాయి లో విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకుని బెల్ట్ షాపులను నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పేరు కోసం అక్కడ.. రాబడి కోసం ఇక్కడ...!

(మొదటిపేజీ తరువాయి)

బాగా అలవాటు పడిపోయారు. రోగులను పట్టించుకోని ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు వైపు చూసేలా సూచనలు ఇస్తూ సొంత క్లినిక్లు, ల్యాబ్లకు తరలింపు గత్యంతరం లేని తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యం అందిస్తారు. ఉమ్మడి తిరుపతి జిల్లాలో నిత్యం ఇటువంటి కేసులు కోకొల్లలు, పలువురు వైద్యులకు ప్రైవేట్ ఆస్పత్రులు..జిల్లాలో మెజార్టీ ప్రభుత్వవైద్యులు ప్రైవేటు వైద్యంపై మోజు చూపుతూ సర్కారీ విధులకు ఎగనామం పెడుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. 24గంటలు సేవలు అందిస్తామంటూ రోగులను పట్టించుకోని ప్రభుత్వ వైద్యులు.. ప్రైవేటు వైపు చూసేలా సూచనలు ఇస్తూ సొంత క్లినిక్లు, ల్యాబ్లకు తరలింపు.. విధులను విస్మరిస్తున్న పలువురు వైద్యులు మెరుగైన వైద్యం పేరిట సొంత ఆస్పత్రులకు రిఫర్ .. చేస్తూ లక్షల్లో,కోట్లు ల్లో డబ్బులు సంపాదిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల ముందు బోర్డులు ఏర్పాటు




చేయడం చూస్తుంటే డాక్టర్లు ప్రభుత్వ విధులకు ఏమేరకు హాజరవుతున్నారో దీని బట్టి తెలిసి పోతోంది. ముఖ్యంగా తిరుపతి లోని స్విమ్స్,రుయా హాస్పిటల్స్ రెగ్యులర్గా పని చేస్తున్న పలువురు డాక్టర్లందరికీ ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ ప్రాక్టిస్కే మొగ్గు చూపడంతో పూర్తి స్థాయి సేవలు అందడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ వైద్యులు మధ్యాహ్నం 12గంటల తర్వాత విధులకు డుమ్మాకొట్టి ప్రైవేట్ అసుపత్రులకు పరిమితమవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆసుపత్రులకు వైద్యం కోసం వచ్చిన రోగులను కొందరు. తమ సొంత ఆసుపత్రులకు రిఫర్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోణలు వెల్లువెత్తుతున్నాయి..

**ప్రైవేటు వైద్యం కొనుగోలు...** ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల తీరు కారణంగా ఉచితంగా అందాల్సిన వైద్యాన్ని పేదలు ప్రైవేటుగా కొనుక్కుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులను మానవత్వంతో చూసే పరిస్థితి లేదు. నిర్లక్ష్యంగా మాట్లాడడం.. రోగి పరిస్థితిని పరిపూర్ణంగా పరిశీలించకుండా త్వరగా పంపించేయడం మామూలుగా మారింది. చాలా మంది వైద్యులు ప్రైవేటు ఆసుపత్రుల్లో సొంత క్లినిక్లు నడుపుతున్నారు. ఇంకొందరు అసుపత్రుల యాజమాన్యాలకు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వ అసుపత్రులకు వచ్చే రోగులకు సక్రమంగా వైద్యం అందించకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండడంతో పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. చేతిలో డబ్బులు లేని కుటుంబాలు దీనస్థితిలో మరో ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. అక్కడైనా వైద్యం అందుతుందన్న భరోసా లేదు.

**వ్యూహాత్మకంగా రెఫరల్...** ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు వ్యూహాత్మకంగా రోగులను తరలిస్తున్నారు. రాబడే లక్ష్యంగా వ్యాపార దృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. గర్భిణులతో పాటు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, ఇతర రోగాల బారిన పడిన వారిని కూడా అత్యవసర వైద్యం అంటూ జిల్లా ఆసుపత్రులకు పంపిస్తున్నారు. అక్కడకు వెళ్లేలోపే రోగం ముదురుతుందని, ప్రాణం మీదకు వస్తుందని భావించిన బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇదంతా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పలువురు వైద్యుల వ్యూహమన్న ఆరోపణలు ఉన్నాయి. రిఫరల్ సమయంలో మీరు రావాలనుకుంటే ఫలానా ప్రైవేటు ఆసుపత్రులకు రండి అని చెబుతున్నారు. అక్కడ అందుబాటులో ఉంటామని కొందరు, తనకు తెలిసిన, మంచి వైద్యులు వున్నారని వారికి రికమండ్ చేస్తానని మరికొందరు సలహా ఇస్తున్నారు. తీరా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. జేబులకు చిల్లులు పెడుతున్నారు.. మెడికల్ షాపులో కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. నచ్చినంత తీసుకుంటున్నారు. లాబ్లో పరీక్షలకు నిర్దిష్టమైన ధరలు లేవు. వీటి నుంచి వైద్యులకు కమీషన్ అందుతుండడంతో పలువురు వైద్యులు ప్రభుత్వ అసుపత్రుల్లో సేవలను నీరుగార్చుతున్నారు. నియోజక వర్గాల్లోని ప్రజాప్రతి నిధులు ప్రభుత్వ అసుపత్రుల్లో అందుతున్న సేవలపై దృష్టిసారించడం లేదు.. దీంతో పలువురు వైద్యులు అడిందే ఆట, పాడిందే పాటన్న విధంగా సాగుతోంది. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు ఇప్పటికైనా ఈ అంశంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

జనం కోసమే సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116



## రిటైర్డ్ ఎస్సై శ్రీనివాసులుకు శ్రద్ధాంజలి

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం వైసీపీ నేత శ్రీకాళహస్తి పత్తి మణి బావ పర్వతాల శ్రీనివాసులు రిటైర్డ్ ఎస్సై అనారోగ్యంతో మరణించారు. వారి పార్థివ దేహానికి శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ మూర్తి, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్, మాజీ కౌన్సిలర్ కంట ఉదయ్ కుమార్, మొగరాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లకు దరఖాస్తు ఆహ్వానం

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటినగరం మండలంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ లోన్లు కొరకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులయిన వారు సంబంధిత సచివాలయ కార్యాలయము లలో అవసరమయిన ధృవపత్రములతో ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు చివరి తేదీ 10.5.2025 తేది లోపు దరఖా చేసుకోవచ్చు అన్నారు.

## పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులుఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుకున్నారు శనివారం మున్సిపల్ కమీషనర్ మధుసూదన్ రెడ్డి పోటీలో ప్రతిభ కనిపించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు మొదటి బహుమతిగా ట్యాబ్ ను గెలుచుకున్న ఏ అమ్రన రెండవ బహుమతి సొంతం చేసుకున్న ఎం హైఫా మూడవ బహుమతి కె. చరిత నాల్గవ బహుమతి యస్ కుబరా భాను ఐదవ బహుమతి వి.సాయి నిధి యస్.అఫిరిన్ విద్యార్థులకుమెడల్స్ వేసి ప్రత్యేకంగా బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో మానసిక ధైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించేవిధంగా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్ రీజినల్ఇన్చార్జ్. శ్రీధర్ పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 23 నుండి మే 3వ తేదీ వరకు
## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల ఉత్సవం

**తిరుపతి బ్యూరో ,మేజర్ న్యూస్ :** తిరుపతి లోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల( శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవం ఏప్రిల్ 23 నుండి మే 2వ తేదీ వరకు జరుగనుంది.ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు పెద్దమాడ వీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర, ఆస్థానం జరుగనుంది. మే 1న భోగి తేరు, మే 2న సాత్తుమొర జరుగనుంది. ఆలయంలో మే 3న గంధపొడి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

## అక్షయ తృతీయ ఆఫర్లను ప్రకటించిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** బాధ్యతాయుతమైన ఆభరణాల వ్యాపార సంస్థగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ డైమండ్స్ అక్షయ తృతీయ పర్వదినం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పండుగ ఆఫర్లను సగర్వంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సోమవారం తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రారంభిస్తూ ఆమె మాట్లాడుతూ ఈ శుభసందర్భాన్ని మరింత చిరస్మరణీయంగా మార్చడానికి విలువ, నమ్మకం మరియు శ్రేష్ఠతను అందించే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న మలబార్, తమ కస్టమర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డీల్స్ అందిస్తుంది అన్నారు. అక్షయ తృతీయ వేడుకల్లో భాగంగా, బంగారు ఆభరణాల తరుగు చార్జీల పై 25% వరకు తగ్గింపు, ప్రీషియస్ స్టోన్స్ అండ్ అన్ కట్ డైమండ్స్ ఆభరణాల తరుగు దార్జీల పై ప్లాట్ 25% తగ్గింపు, వజ్రాల విలువపై 25% వరకు తగ్గింపు అందిస్తోంది. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ (షరతులు వర్తిస్తాయి). ఎంతో విలువైన వృత్తి నైపుణ్యం మేళవించిన ఆభరణాలలో వినియోగదారులు పెట్టుబడి పెట్టడానికి, ఈ పండుగ ఆఫర్లు అసాధారణమైన అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ పండుగ కొనుగోలు అనుభూతిని మరింత లాభదాయకంగా మార్చడానికి, అడ్వాన్స్ బుకింగ్లతో ఉచితంగా వెండి నాణెం అందిస్తుందన్నారు .ఈ పండుగ ఆఫర్ల గురించి మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ మాట్లాడుతూ "శ్రేయస్సు, కొత్త ఆరంభాల శుభదినంగా అక్షయ తృతీయ పర్వదినం, అపారమైన సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. సాటిలేని విలువ కాలాతీత డిజైన్లను అందించడం ద్వారా, మలబార్ గోల్డ్ అండ్




డైమండ్స్ వద్ద, మా కస్టమర్లకు ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా రూపొందించాలనే లక్ష్యంతో ఉన్నాము. మా కృతజ్ఞతను వ్యక్తపరచడానికి, మా విలువైన కస్టమర్లతో శాశ్వత సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ఈ ప్రత్యేకమైన ఆఫర్లు ఒక మార్గం" అన్నారు. సౌభాగ్యాన్ని స్వాగతించడానికి, కొత్త ఆరంభాలకు శ్రీకారం చుట్టడానికి అక్షయ తృతీయ పర్వదినాన్ని ఒక శుభసమయంగా అందరూ భావిస్తారు. సానుకూల దృక్పథంతో రూపొందించిన ఆఫర్లు, సౌకర్యవంతమైన బుకింగ్ ఎంపికలతో, ఈ పండుగ సందర్భం యొక్క ప్రాముఖ్యతకు అనుగుణంగా ఉండాలని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పండుగ కాలంలో ఆలోచించదగిన, అర్థవంతమైన కొనుగోళ్లు చేయడానికి వినియోగదారులకు వీలు కల్పిస్తుంది.

## సివిల్ సప్లై హమాలి వర్కర్స్‌కి జీతాలు ఇవ్వాలి - ఏఐటీయూసీ

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** తిరుపతి జిల్లా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం సివిల్ సప్లై హమాలీ కార్మికులు సమస్యలు మీద శ్రీకాళహస్తి పాయింట్ నందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సివిల్ సప్లై హమాలిస్ మంత్లీ శాలరీలు తిరుపతి జిల్లాలో మాత్రం 20వ తారీకు పైన చెల్లిస్తున్నారు




పక్కనే ఉన్నటువంటి చిత్తూరు జిల్లా అన్నమయ్య జిల్లా నెల్లూరు మిగిలిన జిల్లాలు 12వ తారీకు హమాలి చార్జెస్ చెల్లిస్తున్నారు. ఒక్క తిరుపతి జిల్లా మాత్రం మూడు దఫాలు గ్రీవెన్స్ డే రోజున డైరెక్ట్‌గా కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తిరుపతి జిల్లా డిఎంకి చలనమే లేదు పనిని మాత్రం 30వ తారీకు కల్లా మూమెంట్ పూర్తి చేయాలని హమాలీలపై పని ఒత్తిడి చేస్తున్నారు. ఈ సమస్యలకు నిరసనగా తిరుపతి జిల్లాలో ఉన్నటువంటి 12 పాయింట్లు పూర్తిగా బంద్ చేసి ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. పెంచిన మూడు రూపాయలు కూలికి సంబంధించిన హరియర్స్ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసినప్పటికీ జిల్లాలో మాత్రం ఎటువంటి పని ముందుకు వెళ్ళలేదు పై కార్యక్రమాలు మీద శ్రీకాళహస్తి పాయింట్ నందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం సెక్రటరీ జనమాల గురవయ్య. పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి. ఏఐటియుసి అధ్యక్షులు అయ్యప్ప. గిరి. రుక్కు. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### మే 1 నుండి 10వ తేదీ వరకు
## నారాయణవనం శ్రీ అగస్తీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్:** నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 1 నుండి 10వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు గణపతి ఉత్సవం, అంకురార్పణం నిర్వహిస్తారు.మే 1వ తేదీ ఉదయం 7.30 నుండి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్తీశ్వరస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుండి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. ప్రతి రోజు రాత్రి 7.30 గంటలకు స్వామివారి వాహన సేవలు ఉంటాయి.మే 2వ తేదీ సింహ వాహనం, మే 3న హంస వాహనం, మే 4న శేషవాహనం, మే 5న నంది వాహనం, మే 6న గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మే 7న రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. మే 8న రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, అనంతరం అశ్వవాహన సేవ జరుగనున్నాయి. రూ.500/- చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదాలను బహుమానంగా అందజేస్తారు.మే 9న ఉదయం 9 గంటలకు శ్రీ నటరాజస్వామివారికి అభిషేకం, వీధి ఉత్సవం జరుగనుంది. రాత్రి 7 గంటలకు రావణేశ్వర వాహనంపై అగస్తీశ్వరస్వామి దర్శనమిస్తారు. మే 10న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కైలాసకోనలో త్రిశూలస్నానం ఘనంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.
ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ కోలాటం, ఆధ్యాత్మిక, భక్తిసంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ చరిత్రను పరిశీలిస్తే నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ శ్రీ అగస్తీశ్వరస్వామివారు స్వయంభువుగా వెలిశారు. స్వామివారి లింగాకారానికి పీఠభాగం అనగా బాణపట్టమును అమర్చి వేద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీ అగస్త్య మహర్షులవారు ప్రతిష్ఠ చేసి పూజించినందువల్ల స్వామివారికి అగస్తీశ్వరస్వామి అని పేరు వచ్చింది.